సాక్షి
శ్రీకాకుళం

సోమవారం ౹ 9 ౹ అక్టోబర్ ౹ 2023



ఆర్ట్స్‌లో అరకొర ప్రవేశాలు

పీజీసెట్ సీట్ల అలాట్‌మెంట్ పూర్తయ్యింది. ఆర్ట్స్ గ్రూపుల్లో అరకొర ప్రవేశాలు జరిగాయి.

- 8లో



సుడిదోమ..మేలుకుందామా

వరికి సుడిదోమ ఆశిస్తోంది. ఇప్పడే మేలుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- 8లో

ధ్రువీకరణ పత్రాలు సిద్ధం

ఎచ్చెర్ల క్యాంపస్: సప్లిమెంటరీ (2022-23)లో ఉత్తీర్ణత సాధించిన ఇంటర్మీడియెట్ విద్యార్థుల కోసం ఒరిజనల్ ధ్రువీకరణ పత్రాలు సిద్ధంగా ఉంచినట్లు ఎచ్చెర్ల ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ పీవీఎల్ నారాయణరావు తెలిపారు. కళాశాల నుంచి ఆదివారం ప్రకటన విడుదల చేశారు. 47 మంది విద్యార్థులు సప్లిమెంటరీలో ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. సోమవారం నుంచి ధ్రువీకరణ పత్రాలు అందజేయనున్నట్లు చెప్పారు.

న్యూస్‌రీల్

ఉల్లాసంగా అండర్-18 ఖోఖో జట్ల ఎంపికలు



రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైన జిల్లా జట్లు

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఆదివారం అండర్-18 బాల బాలికల ఖోఖో జిల్లా జట్ల ఎంపికలు ఉల్లాసంగా జరిగాయి. అసోసియేషన్ అధ్యక్షుడు నాగభూషణం, ప్రధాన కార్యదర్శి ఫాల్గుణరావు ఆధ్వర్యంలో ఎంపికలు నిర్వహించారు. ఇందులో ఎంపికైన జిల్లా జట్లు ఈ నెల 22 నుంచి 24 వరకు చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటాయని నిర్వాహకులు బి.నారాయణరావు తెలిపారు. పీడీలు ఎస్.శ్రీనివాసరావు, ఎస్.నారాయణమూర్తి, టి.ఈశ్వర్రావు, తిరుమలరావు, కేకే రామిరెడ్డి, రాజా, శ్రీనివాస్, ప్రకాశ్, జగ్గమ్మ, శైలజ తదితరులు ఎంపికలకు పర్యవేక్షణ చేశారు.

ధర్మ ప్రచార వారోత్సవాలు ప్రారంభం



నగర సంకీర్తనలో పాల్గొన్న భక్తులు

గార: విష్ణుక్షేత్రం శ్రీకూర్మనాథాలయంలో ఆదివారం ఉదయం ధర్మప్రచార వారోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా మూలవిరాట్‌కు ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా గ్రామంలో నగర సంకీర్తన నిర్వహించారు. అనంతరం గోమాత పూజలు నిర్వహించారు. ఆలయ ఈఓ జి.గురునాథం పూజలు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం స్థానికులతో నాద కచేరీ, బాలేరుకు చెందిన జె.వెంకటరావుతో శ్రీ కూర్మావతార వైభవంపై ప్రవచనం జరిగింది.

ఏపీసీపీఎస్ఈఏ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీసీపీఎస్ఈఏ నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: శ్రీకాకుళంలోని అంబేడ్కర్ విజ్ఞాన మందిరంలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీసీపీఎస్ఈఏ) నూతన కార్యవర్గ ఎన్నిక ఏకగ్రీవంగా జరిగింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరిమి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా గౌరవాధ్యక్షులుగా రెడ్డి సూరిబాబు, జిల్లా సలహాదారుగా మక్కా సురేష్, జిల్లా అధ్యక్షుడిగా మెండ రామారావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలగాన చంద్రశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శిగా బాడాన రాజు, మహిళా అధ్యక్షురాలుగా పి.జయమ్మ, సహాధ్యక్షులుగా వి.శరత్, అదనపు ప్రధాన కార్యదర్శిగా ఎం.రామ్మోహనరావు, రాష్ట్ర కౌన్సిలర్లుగా కరిమి రాజేశ్వరరావు, బి.బాలకృష్ణ, వీవీ రాజు, మొయ్యి జనార్దనరావు, సాంకేతిక సలహాదారుగా వై.దాలిబంధు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కరిమి రాజేశ్వరరావు ప్రకటించారు. ఈ సందర్భంగా కరిమి రాజేశ్వరరావు మాట్లాడుతూ పాత పెన్షన్ పునరుద్ధరణ తప్ప వేరే ప్రత్యామ్నాయం అంగీకరించే ప్రసక్తే లేదని అన్నారు.

ఘనంగా సౌర హోమం


అరసవల్లి: ధర్మ ప్రచార వారోత్సవాల కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్థానిక మండపాల్లో వేదమంత్రోచ్ఛరణల మధ్య సౌర హోమం కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో వారోత్సవాల్లో 5వ రోజు సందర్భంగా త్రిచ,సౌర,అరుణ ప్రయుక్త సూర్యనమస్కారాలు కార్యక్రమం నిర్వహించగా, వేదపారాయణాలు, ఉపనిషత్ పారాయణలు తదితర కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో జరిగాయి. కార్యక్రమంలో ఆలయ ఈఓ వి.హరి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు. సాయంత్రం భారతీయ సంస్కృతి నృత్య శిక్షణాలయం వారిచే భరతనాట్యం, వాగ్దేవి కళాసమితి అధ్యక్షురాలు సాహితి ఆధ్వర్యంలో భక్తి సంగీత కార్యక్రమాలు జరిగాయి.

వీధిబడి గర్వపడేలా



తరగతి గదిలో విద్యార్థులు

- ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల ప్రోత్సాహానికి సర్కారు వినూత్న ఆలోచన
- 'సెల్ఫీ విత్ టాపర్స్' పేరిట ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థులకు ప్రోత్సాహం
- ఎఫ్ఏ-2 పరీక్షలతో కార్యక్రమానికి శ్రీకారం
- కలెక్టర్‌తోపాటు ఇతర అధికారుల భాగస్వామ్యం



శ్రీకాకుళం న్యూకాలనీ: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించేందుకు సర్కారు మరో మంచి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రతిభ మీది.. ప్రోత్సాహం మాది అనేటట్టుగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులను ప్రోత్సహించేందుకు 'సెల్ఫీ విత్ టాపర్స్' పేరిట విద్యాశాఖ ప్రత్యేక కార్యక్రమం చేపట్టనుంది. దీనికి సంబంధించిన మార్గదర్శకాలను విద్యాశాఖ విడుదల చేసింది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

పునర్విభజన తర్వాత మిగిలిన 30 మండలాల శ్రీకాకుళం జిల్లాలో మొత్తం ప్రభుత్వ యాజమాన్య పాఠశాలలు 2,655 ఉన్నాయి. వీటిల్లో ప్రాథమిక పాఠశాలలు 1,941, ప్రాథమికోన్నత పాఠశాలలు 304, ఉన్నత పాఠశాలలు 410 ఉన్నాయి. వీటిల్లో మొత్తం 2,02,075 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. వీరిలో బాలురు 98,467 మంది, బాలికలు 1,03,608 మంది ఉన్నారు.

ఎఫ్ఏ-2 పరీక్షలతో మొదలు..

ఫార్మేటివ్ అసెస్మెంట్ (ఎఫ్ఏ)-2 పరీక్షల నుంచి సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం అమల్లోకి రానుంది. పాఠశాలల్లో నిర్వహించిన పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను మరింత ప్రోత్సహించేందుకు 'సెల్ఫీ విత్ టాపర్స్' కార్యక్రమానికి ప్రభుత్వం అంకురార్పణ చేసింది. వివిధ పరీక్షల్లో టాపర్లుగా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు సెల్ఫీలు తీసుకుని సామాజిక మాధ్యమాల్లో వారి ప్రతిభను తెలియజేసేలా పోస్టింగులు చేయాలని ఆదేశించింది. ప్రతిభను ప్రోత్సహించడంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ ముందు వరుసలో ఉంటారనే సత్యాన్ని లోకానికి తెలియజేయాలని పాఠశాల విద్యాశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. తద్వారా విద్యార్థుల్లో మరిన్ని మంచి మార్కులు సాధించాలనే ఆలోచన, పట్టుదల పెరుగుతుందని, మిగిలిన విద్యార్థుల్లోనూ పోటీతత్వాన్ని పెంపొందింపజేస్తుందని భావిస్తున్నారు. ఎఫ్ఏ-2 పరీక్షలు ఈనెల 3 నుంచి 5వ తేదీ వరకు జరిగిన విషయం తెలిసిందే. సబ్జెక్టు టీచర్లు పరీక్షల మూల్యాంకనం పూర్తి చేసిన తర్వాత మార్కులను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు. ఆ స్కూల్‌లోని అన్ని సబ్జెక్టుల మూల్యాంకనం ముగిసిన తర్వాత టాపర్స్ లిస్టును ప్రిపేర్ చేసుకుని.. వెంటనే సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమాన్ని ప్రారంభించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఆ మేరకు హెచ్‌ఎంలకు ఆదేశాలు జారీ చేశారు. సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తోపాటు ఇతర ఉన్నతాధికారులు, జిల్లా అధికారులు, స్థానిక అధికారులు కూడా భాగస్వామ్యం కానున్నారు. విద్యార్థుల ప్రగతిని, వారి మార్కులను తల్లిదండ్రులకు తెలియజేసేలా పేరెంట్స్ మీటింగ్‌లను కూడా చేపట్టనున్నారు.

చాలా మంచి కార్యక్రమం



సెల్ఫీ విత్ టాపర్స్ పేరిట ప్రభుత్వం తీసుకొచ్చిన కార్యక్రమం చాలా మంచిది. టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ఎంఈఓలు, డీఈవైలు, డీఈవోలు సెల్ఫీలు తీసి వాటిని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయాలి. తద్వారా ప్రతిభ కలిగిన విద్యార్థులను ప్రోత్సహించినట్టవుతుంది.

– ఎం.జ్యోతికుమారి, ఆర్జేడీ పాఠశాల విద్య, విశాఖపట్నం

ఉన్నతాధికారుల భాగస్వామ్యం



సర్కారు స్కూళ్లలో చదువుతున్న విద్యార్థులకు ఉన్నతమైన ప్రమాణాలతో కూడిన విద్యను అందించేందుకు ప్రభుత్వం అనేక పథకాలు, ఎన్నో కార్యక్రమాలను తీసుకొచ్చింది. సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం కూడా అలాంటిదే. స్కూళ్లలో నిర్వహించే పరీక్షల టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో ఉపాధ్యాయులు, హెచ్‌ఎంలు, ఎంఈఓలతోపాటు కలెక్టర్, జేసీ, ఎస్పీతోపాటు జిల్లా అధికారులు కూడా భాగస్వామ్యం కానుండటం శుభపరిణామం.

– డాక్టర్ రోణంకి జయప్రకాష్, సమగ్రశిక్ష ప్రాజెక్ట్, ఏపీసీ శ్రీకాకుళం

పోటీతత్వం పెరుగుతుంది



ప్రభుత్వ బడుల్లో చదువుతున్న విద్యార్థులను మరింతగా ప్రోత్సహించేలా రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టిన సెల్ఫీ విత్ టాపర్స్ కార్యక్రమం చాలా వినూత్నమైనది. విద్యార్థుల తరపున ప్రభుత్వానికి శుభాకాంక్షలు చెబుతున్నాం. ఈ కార్యక్రమం ద్వారా టాపర్స్‌ను ప్రోత్సహించడంతో పాటు మిగిలిన విద్యార్థుల్లో సైతం పోటీతత్వం పెరుగుతుంది. ఎఫ్ఏ-2 పరీక్షల మూల్యాంకనం వెంటనే పూర్తిచేసి, వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలి. టాపర్స్ లిస్టులను సిద్ధం చేసుకోవాలి.

– కె.వెంకటేశ్వరరావు, డీఈఓ శ్రీకాకుళం

టీహెచ్ఆర్ పంపిణీలో టాప్



టీహెచ్ఆర్ పంపిణీ చేస్తున్న శాంతిశ్రీ

శ్రీకాకుళం అర్బన్: టేక్ హోమ్ రేషన్‌లో జిల్లా రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచింది. గర్భిణులు, బాలింతలకు స్త్రీ శిశు సంక్షేమ శాఖ ద్వారా అందజేస్తున్న పౌష్టికాహారాన్ని ఇంటికే పంపించేందుకు ఈ విధానాన్ని ప్రభుత్వం ప్రవేశపెట్టింది. రాష్ట్ర వ్యాప్తంగా 26 జిల్లాలకు గాను శ్రీకాకుళం జిల్లా మొదటి స్థానంలో నిలిచింది. రెండో స్థానంలో ఎన్టీఆర్ జిల్లా, మూడో స్థానంలో బాపట్ల నిలిచాయి. జిల్లాలో టీహెచ్ఆర్ పంపిణీ రెండు విడతల్లో జరుగుతోంది. మొదటి విడత ప్రతినెల మొదటి శుక్రవారం నుంచి మూడు రోజుల్లోనూ, రెండో విడత ప్రతి మూడో శుక్రవారం నుంచి మూడు రోజుల్లోనూ నిర్వహిస్తారు.



జిల్లాలో 3358 అంగన్‌వాడీ కేంద్రాలకు గాను 3,159 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలకు మొదటి విడత టీహెచ్ఆర్ పంపిణీ చేశారు. ఇందులో అంగన్‌వాడీ కేంద్రాల్లో 10,189 మంది గర్భిణులు తమ పేర్లను నమోదు చేసుకున్నారు. ఇందులో 8,558 మందికి టీహెచ్ఆర్ ద్వారా పోషకాహారం అందించారు. ఇంకా 1631 మందికి టీహెచ్ఆర్ ద్వారా పోషకాహారం ఇవ్వాల్సి ఉంది. అలాగే 10,530 మంది బాలింతలు నమోదు కాగా అందులో 9125 మందికి టీహెచ్ఆర్ ద్వారా అందజేస్తున్నారు. ఇంకా 1296 మందికి ఇవ్వాల్సి ఉంది. ఈ రెండు రోజుల్లోనే టీహెచ్ఆర్ ద్వారా గర్భిణులకు, బాలింతలకు పోషకాహారం 89శాతం మేర అందజేయగా ఇంకా ఒక రోజు మిగిలి ఉంది. ఈ ఒక్కరోజులో కూడా మిగిలిన గర్భిణులకు, బాలింతలకు టీహెచ్ఆర్ ద్వారా పోషకాహారం అందజేసి శతశాతానికి చేరుకుంటామని అంగన్‌వాడీ అధికారులు చెబుతున్నారు. ఐసీడీఎస్ పీడీగా బి.శాంతిశ్రీ నియమితులైన తర్వాత జిల్లాలో టీహెచ్ఆర్ జోరందుకుంది.

లక్ష్యం చేరుకుంటాం



టేక్ హోమ్ రేషన్‌ను పారదర్శకంగా అమలు చేస్తున్నాం. నెలలో మొదటి శుక్రవారం నుంచి మూడు రోజుల్లో పంపిణీ చేయాల్సి ఉంది. అయితే రెండు రోజుల్లోనే 89 శాతానికి చేరుకున్నాం. ఇంకా ఒకరోజు గడువు ఉంది. మూడో రోజు టీహెచ్ఆర్ పంపిణీ చేసి నూటికి నూరు శాతానికి చేరుకుంటాం.

– బి.శాంతిశ్రీ, ఐసీడీఎస్ పీడీ

కొత్త వరి వంగడాల సాగు అభినందనీయం



కొజ్జిరియాలో రైతు ఉప్పాడ వాసుతో ఏడీఏ జగన్మోహనరావు, అధికారులు

కవిటి : రైతులు కొత్త వరి వంగడాలు సాగు చేయడం అభినందనీయమని సోంపేట వ్యవసాయ సహాయ సంచాలకులు పి.జగన్మోహనరావు అన్నారు. మండలంలోని కొజ్జిరియా సచివాలయం పరిధిలో ఆదివారం అభ్యుదయ రైతు ఉప్పాడ వాసుదేవరావు సాగు చేసిన యూటీఆర్-181(ఊటుకూరు)రకం వరిపంటను ఆయన పరిశీలించారు. ఈ పంటకు సంబంధించి రైతు తన అనుభవాలను వ్యవసాయ అధికారులకు వివరించారు. కృష్ణా జిల్లా నుంచి ఈ రకం వరి విత్తనాలు కొనుగోలు చేసి తీసుకువచ్చానని తెలిపారు. 145-150 రోజుల పంటకాలం కలిగిన ఈ పంట కోసం ఎండు దుక్కులు సీజన్‌లో ఎకరానికి ఐదు ట్రక్కులు చివికిన ఆవు పేడ వేశానన్నారు. విత్తనాలు తీసుకువచ్చి జీవశిలీంద్రనాశినిలో విత్తన శుద్ధి చేశానన్నారు. నాట్లు వేసే సమయంలోనే కాలిబాటలు ఏర్పాటుచేశామని తెలిపారు. సకాలంలో అధికారులు సూచించిన మోతాదులో రసాయన ఎరువులు కూడా అందించామని చెప్పారు. రైతు చర్యల్ని ఏడీఏ పి.జగన్మోహనరావు అభినందించారు. ఈ పంటను రైతు భరోసా కేంద్రాల జిల్లా వనరుల కేంద్రం అధికారులు సైతం పరిశీలించి రైతు వాసుదేవరావును అభినందించారు.

కొత్తమ్మ తల్లి జాతరకు భారీ ఏర్పాట్లు





మెయిన్ రోడ్డులో ఏర్పాటుచేస్తున్న దేవతామూర్తుల విద్యుత్ హోర్డింగ్ (ఇన్‌సెట్‌లో) కొత్తమ్మతల్లి

కోటబొమ్మాళి: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం కోటబొమ్మాళి కొత్తమ్మ తల్లి జాతరకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బోయిన మాధవి, ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు బోయిన నాగేశ్వరరావు, ఆలయ ఈఓ వి.రాధాకృష్ణ, దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా దసరా పండగకు ముందు వచ్చే మంగళవారం నుంచి గురువారం వరకూ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. ఉత్సవ నిర్వహణపై ఇటీవలే వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి అధికారులు, కమిటీ సభ్యులతో సమీక్షించారు. ప్రస్తుతం కొత్తపేట జంక్షన్ నుంచి కోటబొమ్మాళి రైతుబజార్ వరకూ విద్యుత్ దీపాలు, దేవతామూర్తుల హోర్డింగ్‌లు అమర్చే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సాంస్కృతిక, క్రీడా పోటీల కోసం మైదానం సిద్ధం చేస్తున్నారు. అమ్మవారి ఆలయం వద్ద భక్తుల కోసం క్యూలైన్‌లు సిద్ధం చేస్తున్నారు. విద్యుత్ సరఫరాకు ఆటంకం లేకుండా అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఉత్సవాల కోసం 400 మందితో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పోలీసు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

జైల్లో చంద్రబాబు.. ఢిల్లీలో లోకేష్



మాట్లాడుతున్న రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు

- మంత్రి సీదిరి అప్పలరాజు

కాశీబుగ్గ: చంద్రబాబు నాయుడు దొరికిన దొంగ అయితే మరో దొంగ నారా లోకేష్ అని రాష్ట్ర పశు సంవర్ధక పాడి పరిశ్రమల మత్స్యశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. తండ్రి జైలులో ఉంటే లోకేష్ ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నాడని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో పలాసలో గౌతు కుటుంబం అడ్రస్ గల్లంతవుతుందని ఆయన అన్నారు. మంత్రి క్యాంప్ కార్యాలయం ఆవరణలో మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. నలభై ఏళ్ల రాజకీయ చరిత్ర అంటూ ఎప్పుడూ చెప్పే చంద్రబాబు జైలుకు ఎందుకు వెళ్లారో కూడా చెప్పాలని కోరారు. వైఎస్ జగన్ వంటి ముఖ్యమంత్రి ఉంటే రాజకీయాలకు అతీతంగా మంచి జరుగుతుందని అన్నారు. తాను ఎమ్మెల్యే అయ్యాక పలాస నియోజకవర్గంలో రూ.2వేల కోట్లతో అభివృద్ధి పనులు చేశానని, మరి గౌతు కుటుంబం 60 ఏళ్ల పాలనలో ఏం చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. తనకు రాజకీయాలు తప్ప మరో పని లేదని, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటానని, అర్ధరాత్రి తలుపు కొట్టినా పలుకుతానని అన్నారు.

తెలుగుదేశం పార్టీ జరుపుతున్న దిక్కుమాలిన దీక్షలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని, జగన్ నాలుగున్నర ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధికి కట్టుబడి ఉన్నారని అన్నారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే అందరం కూర్చుని పరిష్కరించుకుందామని, పలాసలో వైఎస్సార్‌సీపీ గెలుపును ముఖ్యమంత్రికి కానుకగా ఇద్దామని అన్నారు.

సమావేశంలో డాక్టర్ దానేటి శ్రీధర్, పలాస పీఏసీఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు, పలాస ఎంపీపీ ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మందస ఎంపీపీ డొక్కారి దానయ్య, నాయకులు హనుమంతు వెంకటరావు, పానిల శ్రీనివాసరావు, రాపాక చిన్నారావు, బెల్లాల శ్రీనివాసరావు, అందాల శేషగిరి, బోర కృష్ణారావు, మీసాల సురేష్‌బాబు, బెల్లాల శ్రీనివాసరావు, మచ్చ ధనరాజు, శిష్టు గోపి, దువ్వాడ రవి, పీవీ సతీష్, డబ్బీరు భవానీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కేఆర్ స్టేడియం త్వరగా పూర్తి చేస్తాం

- రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు



మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు, పక్కనే కృష్ణదాస్ తదితరులు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం క్రీడాలోకం చిరకాల కోరిక కోడి రామ్మూర్తి స్టేడియం అని, ఈ పనులు త్వరితగతిన పూర్తి చేస్తామని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని కోడి రామ్మూర్తి స్టేడియం ఆధునికీకరణకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలో 'థాంక్యూ యూ సీఎం సార్.. జయహో ధర్మాన' పేరిట ఆదివారం కేఆర్ స్టేడియం ప్రాంగణంలో అభినందన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ధర్మాన మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పడ్డాక జిల్లాతోపాటు శ్రీకాకుళం పట్టణంలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు గుర్తుచేశారు. భవనాలు మాత్రమే అభివృద్ధా..? తినడానికి కూడా స్థోమత లేని వారికి చేయూత, తాగేందుకు అవసరమైన నీరు, రైతులకు ఎరువులు, మందులకు ఆర్థికంగా బాసట, నాడు-నేడుతో బడులన్నీ అభివృద్ధి, విద్యార్థులకు సీబీఎస్సీ సిలబస్‌తో నాణ్యమైన చదువు, మహిళలకు ఆసరా ఇవన్నీ అభివృద్ధి కిందికి రావా? అని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. పాలనకు సంబంధించి అనేక సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు.

మాట నిలబెట్టుకునే కుటుంబం

వేర్వేరు సందర్భాల్లో తాను సీఎం వైఎస్ జగన్‌ను కలిసినప్పుడు స్టేడియం కోసం ప్రస్తావిస్తే.. ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి ధర్మాన అన్నారు. ఎన్ని నష్టాలు, కష్టాలు వచ్చినా ఇచ్చిన మాటకు కట్టుబడటం, ఇచ్చిన మాటను నెరవేర్చే మనస్తత్వం, వ్యక్తిత్వం నాడు దివంగత వైఎస్సార్‌లో, నేడు సీఎం జగన్‌లో చూశామన్నారు. జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కేఆర్ స్టేడియం నిర్మాణం కోసం రూ .12 కోట్ల నిధులు మంజూరు చేసినందుకు, పట్టణ ప్రజలు, క్రీడాకారుల తరఫున సీఎం వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు చెప్పారు. శ్రీకాకుళంలోని ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ పనులు ఫిబ్రవరి నెలలోగా పూర్తిచేస్తామన్నారు.

పది వేల మందితో ర్యాలీ

మాజీ డిప్యూటీ సీఎం, ఒలింపిక్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని క్రీడా సంఘాలు ఏకతాటిపై ఉండటం అభినందనీయమన్నారు. ఒలింపిక్ సంఘం, డీఎస్ఏ ఆధ్వర్యంలో అభివృద్ధికి అన్ని క్రీడాసంఘాలు ముందడుగు వేయాలన్నారు. రాష్ట్రంలో మంచి నాయకుడు, యువకుడు సీఎంగా ఉన్నారని.. క్రీడల అభివృద్ధికి బాసటగా నిలుస్తున్నారని సీఎం జగన్‌ను కొనియాడారు. కేఆర్ స్టేడియం నిర్మాణం మొదలైన రోజు శ్రీకాకుళంలో 10వేల మందితో భారీస్థాయిలో క్రీడా ర్యాలీని తీద్దామని ప్రకటించారు. అందుకు కార్యాచరణ చేయాలని ఒలింపిక్ సంఘ ప్రతినిధులకు దానన్న సూచించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు, క్రీడాసంఘాల బాధ్యులు ప్రసంగిస్తూ కేఆర్ స్టేడియానికి నిధులు మంజూరు చేయడం వెనుక ధర్మాన కృషిని, సీఎం జగన్ చొరవను ప్రశంసించారు. అనంతరం ధర్మాన సోదరులను ఘనంగా సత్కరించారు. ఆ తర్వాత సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి ధర్మాన కృష్ణదాస్, ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, ఒలింపిక్ సంఘ ప్రతినిధులు, క్రీడాసంఘాల ప్రతినిధులు ఘనంగా క్షీరాభిషేకం చేశారు.

కార్యక్రమంలో రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, డీఎస్ఏ చీఫ్ కోచ్ డాక్టర్ శ్రీధర్‌రావు, డాక్టర్ శ్రీనివాస్‌పట్నాయక్, సుంకరి కృష్ణకుమార్, పి.సుందరరావు, ఎండీ కాసీం ఖాన్, ఎంవీ రమణ, ఎం.సాంబమూర్తి, బీవీ రమణ, గులోన, సాధు వైకుంఠరావు, మెంటాడ స్వరూప్, కిల్లంశెట్టి సాగర్, సంపతిరావు సూరిబాబు, పోలినాయుడు, ఎమ్మెస్సీ శేఖర్, మండవల్లి రవి, కోణార్క్ శ్రీను, ఇందిరాప్రసాద్, పొన్నాడ రవికుమార్, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

అరుణ కిరణ తరుణమిది



గగనంలో అరుణారుణ కిరణాలు.. భువనంలో ఆకుపచ్చని చేలు కలగలిపి ఈ అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. శ్రీకాకుళం సమీపంలోని పొలాల్లో సూర్యాస్తమయ సమయంలో ఈ మనోహర దృశ్యం కనిపించింది.

– శ్రీకాకుళం క్రైమ్

క్లుప్తంగా

పాము కాటుతో మహిళ మృతి


నీలాపు మీన (ఫైల్)

గార: కళింగపట్నం పంచాయతీ సిలగాం కాలనీకి చెందిన నీలాపు మీన (35) అనే మహిళ పాముకాటుకు గురై మృతి చెందారు. ఆమె ఆదివారం సాయంత్రం ఇంటి వెనుక పొలాల్లోకి వెళ్లగా అక్కడే పాము కాటేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. స్థానికులు పరిశీలించేసరికే మృతి చెందారు. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

అదృశ్యమైన వృద్ధురాలు మృతి


మృతి చెందిన వృద్ధురాలు

టెక్కలి రూరల్: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వెనుక భాగంలో ఆదివారం ఉదయం ఒక వృద్ధురాలి మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించగా మృతురాలు కొత్తమ్మతల్లి వీధికి చెందిన కురమాన అమ్మన్నమ్మ(75)గా గుర్తించారు. మృతురాలికి మతి స్థిమితం సరిగా ఉండదు. శనివారం ఉదయం తన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. అప్పటి నుంచి వృద్ధురాలి గురించి గాలిస్తున్న సమయంలో ఇలా చనిపోయి కనిపించింది. ఒంటిపై ఎలాంటి గాయాల ఆనవాళ్లు లేకపోవడంతో సహజ మరణంగా గుర్తించి కుటుంబ సభ్యులకు మృతదేహాన్ని అందజేశారు.

సారా స్థావరాలపై దాడులు


సారా తయారీకి వినియోగించిన సామగ్రి, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్న పోలీసులు

మెళియాపుట్టి: సారా నిర్మూలనే ధ్యేయంగా ఎస్పీ జీఆర్ రాధిక ఆదేశాల మేరకు కార్డన్ సెర్చ్ కార్యక్రమం ద్వారా సారా తయారు చేసే స్థావరాలపై దాడులు నిర్వహిస్తున్నామని పాతపట్నం సీఐ ఎం.వినోద్ బాబు అన్నారు. అందులో భాగంగానే ముందస్తు సమాచారం మేరకు మండలంలోని సవర మర్రిపాడు గ్రామంలో టెక్కలి ఎస్టీఎఫ్ఆర్టీ బృందాలతో కలసి దాడులు చేశామని తెలిపారు. ఆదివారం నిర్వహించిన ఈ దాడుల్లో 1200 లీటర్ల పులిసిన బెల్లపు ఊటలను ధ్వంసం చేశారు. 50 లీటర్ల నాటుసారా, సారా తయారీకి వినియోగించిన సామగ్రి, డ్రమ్ములను స్వాధీనం చేసుకున్నారు. నిషేధిత నాటుసారా తయారీ, క్రయవిక్రయాలు నిర్వహిస్తున్న పెద్దింటి నూకరాజు, పెద్దింటి వెంకటరమణలను అరెస్ట్ చేశామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా.. తయారు చేసినా కఠిన చర్యలు తప్పవని అన్నారు. మెళియాపుట్టి ఎస్ఐ రాజేష్ పలువురు సిబ్బంది ఉన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు

మైదుకూరు : వైఎస్సార్ జిల్లా మైదుకూరులో రాష్ట్రస్థాయి అండర్-17 వాలీబాల్ పోటీలు హోరాహోరీగా జరుగుతున్నాయి. బాలికల విభాగంలో గుంటూరు, బాలుర విభాగంలో విజయనగరం జిల్లా జట్లు ఫైనల్‌కు చేరుకున్నాయి. ఆదివారం జరిగిన బాలికల విభాగం మొదటి సెమీఫైనల్ మ్యాచ్‌లో గుంటూరు – ప్రకాశం జిల్లాలు తలపడగా ప్రకాశం జిల్లాను ఓడించి గుంటూరు ఫైనల్‌కు చేరింది. బాలుర విభాగంలో శ్రీకాకుళం – విజయనగరం జిల్లాల మధ్య మొదటి సెమీ ఫైనల్ పోరు జరిగింది. ఈ మ్యాచ్‌లో విజయనగరం శ్రీకాకుళం జిల్లాను ఓడించి ఫైనల్‌కు చేరుకుంది. సోమవారం బాలికల విభాగంలో చిత్తూరు – కడప జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరుగనుంది. ఈ మ్యాచ్‌లో విజేత ఫైనల్లో గుంటూరు జిల్లాతో తలపడనుంది. అదే విధంగా బాలుర విభాగంలో పశ్చిమ గోదావరి – అనంతపురం జిల్లాల మధ్య రెండో సెమీ ఫైనల్ మ్యాచ్ జరగనుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌లో విజయనగరం జిల్లాతో ఆడనుంది.

క్రీడాస్ఫూర్తితో ఆడాలి

గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో ఆడాలని వైఎస్సార్ జిల్లాకు చెందిన సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయుడు, వాలీబాల్ ఎక్స్‌పర్ట్ షామీర్ బాషా అన్నారు. ఆదివారం ఆయన క్రీడాకారులతో మాట్లాడారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి తర్వాత దేశానికి ప్రాతినిధ్యం వహించి మంచి పేరు తీసుకురావాలని తెలిపారు. అనంతరం స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ వైఎస్సార్, అన్నమయ్య జిల్లాల కార్యనిర్వాహక కార్యదర్శులు అరుణకుమారి, వసంత, మేధా డిఫెన్స్ అకాడమీ చైర్మన్ నరసింహులు షామీర్‌బాషాను సత్కరించారు.

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹140	₹235	₹ 255

ఆర్ట్స్‌లో అరకొర ప్రవేశాలు

- రాష్ట్ర పీజీ సెట్-2023 సీట్ల అలాట్‌మెంట్ ప్రకటన
- వర్సిటీలో 16 కోర్సుల్లో పీజీ సెట్ ద్వారా ప్రవేశాలు
- 605 సీట్లకు 244 ప్రవేశాలు

ప్రవేశాలు పరిశీలిస్తే...

కోర్సు	సీట్లు	ప్రవేశాలు
ఎకనామిక్స్	44	08
రూరల్ డెవలప్‌మెంట్	44	05
ఎంకాం	44	11
ఎంఎల్ఐఎస్సీ	44	16
ఇంగ్లీష్	44	20
ఎంఈడీ	44	06
సోషల్ వర్క్	44	04
తెలుగు	44	09
ఎంజేఎంసీ	33	05
మ్యాథ్స్	44	24
అప్లైడ్ మ్యాథ్స్	22	17
ఆర్గానిక్ కెమిస్ట్రీ	33	33
అనలాటికల్ కెమిస్ట్రీ	22	22
బయోటెక్నాలజీ	33	31
మైక్రో బయోలజీ	22	21
ఫిజిక్స్	44	12


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం


వర్సిటీలో క్లాస్ వర్కు

ఎచ్చెర్ల క్యాంపస్: రాష్ట్రంలోని 14 విశ్వ విద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కామన్ పోస్టు గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తోంది. గతంలో విశ్వవిద్యాలయాలు తమ పరిధిలో సెట్‌లు నిర్వహించేవి. ఒకే దరఖాస్తు ద్వారా ప్రవేశ పరీక్ష రాయటం, నచ్చిన విశ్వవిద్యాలయంలో విద్యార్థికి చేరే అవకాశం కల్పించటం, పీజీ విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులు కోర్సుల్లో చేరే అవకాశం ఉండటం వంటి అంశాలు పరిగణనలోకి తీసుకొని రాష్ట్రస్థాయిలో ఈ ఉమ్మడి పరీక్ష నిర్వహించారు. ఈ ఏడాది ఆంధ్రా విశ్వవిద్యాలయం పరీక్ష నిర్వహించింది. అనంతరం కౌన్సెలింగ్ పూర్తి కాగా, సీట్లు అలాట్‌మెంట్ కూడా ప్రకటించారు. సీట్లు లభించిన విద్యార్థులు కళాశాలలకు రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో 16 కోర్సులు ఉండగా, 605 సీట్లు ఉన్నాయి. 244 ప్రవేశాలు మొదటి కౌన్సెలింగ్‌లో జరిగాయి. 40.33 శాతం సీట్లు నిండాయి. కొన్ని ఆర్ట్స్ గ్రూపుల్లో సింగిల్ డిజిట్ ప్రవేశాలు జరిగాయి. ఎకనామిక్స్, రూరల్ డెవలప్‌మెంట్, ఎంఈడీ, సోషల్ వర్క్, తెలుగు, ఎంజేఎంసీల్లో కనీస ప్రవేశాలు జరగలేదు. సైన్స్ కోర్సుల్లో మాత్రం మెరుగ్గా ప్రవేశాలు జరిగాయి.

రెండో విడతలో మెరుగు పడవచ్చు



మొదటి విడత కౌన్సెలింగ్ పూర్తయ్యింది. రెండో విడత కౌన్సెలింగ్ త్వరలో జరగనుంది. ఈ కౌన్సెలింగ్‌లో ప్రవేశాలు మెరుగుపడవచ్చు. ఉన్నత విద్యా మండలి మార్గ దర్శకాలను అనుగుణంగా మిగులు సీట్లకు ప్రవేశాలు కల్పిస్తాం.

– ప్రొఫెసర్ సీహెచ్‌ఏ రాజేంద్ర ప్రసాద్, రిజిస్ట్రార్, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం

కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న మీనాకుమారి


మీనాకుమారి (ఫైల్)

ఇచ్ఛాపురం రూరల్: అత్తమామల వేధింపులు ఓ నిండు ప్రాణాన్ని బలికొన్నాయి. వివరాల్లోకి వెళితే.. ఇచ్ఛాపురం మండలం ధర్మపురం గ్రామానికి చెందిన పైలా తులసయ్య, మోహినీల కుమార్తె నీలాపు మీనాకుమారి(22)ని ఏడేళ్ల కిందట అదే మండలం నీలాపుపుట్టుగ గ్రామానికి చెందిన నీలాపు మోహన్ బాబుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఐదేళ్ల బాబు తులసీదాసు, రెండున్నరేళ్ల పాప ధనుశ్రీలు ఉన్నారు. ఏడు నెలల కిందట భర్త మోహన్‌బాబు విదేశాలకు వలస వెళ్లిపోవడంతో కుటుంబంలో కలహాలు మొదలైనట్లు మృతురాలి తల్లిదండ్రులు చెబుతున్నారు. మామ జగ్గారావు, అత్త అన్నపూర్ణలు ప్రతి రోజు తమ కుమార్తెతో గొడవలకు దిగడంతో పలుమార్లు సర్ది చెప్పినట్లు తెలిపారు. శనివారం మధ్యాహ్నం మరోమారు గొడవ కావడంతో మీనాకుమారి సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఇంటిలోనే ఉరి వేసుకుంది. విషయం తెలుసుకున్న మృతురాలి తల్లిదండ్రులు తమ బిడ్డ చావుకు అత్తింటి వారే కారణమంటూ గ్రామంలో పెద్దలతో పంచాయతీ పెట్టారు. తమ కోడలు కడుపు నొప్పి తాళలేక ఆత్మహత్య చేసుకుందని అత్తామామలు పంచాయతీలో చెప్పడంతో ఇరు కుటుంబాల మధ్య రాజీ కుదరలేదు, మృతురాలి తల్లి పైలా మోహిని ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ ఎస్ఐ రమేష్ కేసు నమోదు చేశారు.

శ్రీకాకుళం నుంచి వచ్చిన క్లూస్ టీమ్ ఆదివారం ఆత్మహత్య చేసుకున్న ఇంటిని పరిశీలించింది. అనంతరం మృతదేహాన్ని ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి తరలించారు.

ఉత్సాహంగా హ్యాండ్‌బాల్ ఎంపికలు


హ్యాండ్‌బాల్ జట్ల క్రీడాకారులతో సంఘ ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లా స్థాయి హ్యాండ్‌బాల్ ఎంపిక పోటీలు ఆద్యంతం ఉత్సాహభరితంగా సాగాయి. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా జూనియర్స్ బాలురు, సీనియర్స్ మహిళల హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు శ్రీకాకుళం ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల మైదానం వేదికగా జరిగాయి. జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు సుంకరి కృష్ణకుమార్, ప్రధాన కార్యదర్శి ఎమ్మెస్సీ శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎంపికలకు జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరై తమ ప్రతిభను నిరూపించుకున్నారు. ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని కృష్ణకుమార్, చంద్రశేఖర్ పేర్కొన్నారు.

ఇక్కడ ఎంపికైన జిల్లా జట్లను ఈనెల 13 నుంచి 15వ తేదీ వరకు వైఎస్సార్ కడప జిల్లా వేదికగా జరగనున్న ఏపీ రాష్ట్రస్థాయి జూనియర్స్ బాలురు, సీనియర్స్ మహిళల హ్యాండ్‌బాల్ చాంపియన్‌షిప్-2023 పోటీలకు పంపిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు శేఖర్, గురుగుబెల్లి రాజశేఖర్, హరీష్‌రాయుడు, ఈశ్వరరావు, ఢిల్లేశ్వరరావు, కనకసుందర్, కోచ్‌లు సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

'సంఘటితంగా పోరాడదాం'


కాశీబుగ్గలో ప్రగతిశీల మహిళా సంఘ తరగతులకు హాజరైన మహిళలు


కాశీబుగ్గ,పలాస: స్త్రీ, పురుష సమానత్వం కోసం మహిళలు సమైక్యంగా ఉద్యమించాలని స్త్రీలపై జరుగుతున్న లైంగికదాడులు, వివక్ష అణచివేతలకు వ్యతిరేకంగా సంఘటితంగా పోరాడాలని ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్.విష్ణు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలోని గణపతి రెసిడెన్సీలో ఆ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర స్థాయి విద్యా వైజ్ఞానిక తరగతులు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పార్లమెంటులో ఉండిపోయిన ఫైళ్లను ప్రధాని మోదీ ఆమోదించారే తప్ప మహిళల విముక్తి కోసం కాదన్నారు. ఇది మహిళల కన్నీటి తుడుపు చర్య మాత్రమేనని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ బి.పద్మ అన్నారు. మణిపూర్‌లో కుకీజాతి మహిళలని నగ్నంగా ఊరేగించి అత్యాచారం చేసి హత్యలు చేసినా నోరు మెదపలేదని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.అనసూయ మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చి కార్పొరేట్ ప్రయోజనాల కోసం ఆదివాసీల అడవులను వనరులను సంపదను అదానీ, అంబానీలకు ధారాదత్తం చేసేందుకు అటవీ సంరక్షణ చట్టం-2023 తీసుకొచ్చారని ఆరోపించారు. అంతకు ముందు అమరులైన పంచాది నిర్మల, సరస్వతి అంకమ్మ, స్నేహలత, చిట్టెమ్మ, పారమ్మ, కామ్రేడ్ చంద్రమ్మ, జయక్క తదితరులకు నివాళులర్పించారు. కార్యక్రమంలో సంఘ సహాయ కార్యదర్శి శీలం ఏసమ్మ, రాష్ట్ర నాయకులు బి.ఈశ్వరి, చిలకమ్మ, శాంతి, రమ, కల్పన, మంజుల, వసంతమ్మ పాల్గొన్నారు.

సుడిదోమ.. మేలుకుందామా

- వరికి సోకిన సుడిదోమ
- తగిన జాగ్రత్తలు పాటిస్తే నివారణ సాధ్యం


మెట్ట మోహనరావు


సుడిదోమ నివారణకు వరిపంటకు పురుగుమందు పిచికారీ చేస్తున్న రైతు


(ఇన్‌సెట్లో) వరిలో దుబ్బుకు పట్టిన సుడిదోమ

ఆమదాలవలస రూరల్: జిల్లాలో వరికి సుడిదోమ ఆశిస్తోంది. దీని వల్ల పంటకు తీవ్ర నష్టం కలుగుతుందని రైతులు వాపోతున్నారు. ఏడాది కాలంగా కష్టపడి చివరి దశలో పంట దోమ పోటుకు గురై రైతులకు నిద్ర లేకుండా చేస్తోంది. జిల్లాలో వరి పంట ప్రస్తుతం 1.42 లక్షల హెక్టార్లలో సాగులో ఉంది. ఖరీఫ్ సీజన్‌లో ప్రస్తుతం వరి పంట పొట్టదశలో ఉన్నందున చాలా ప్రాంతాల్లో సుడిదోమ సోకి నాశనమవుతోంది. వాతావరణంలో మార్పుల కారణంగా వరిపంట దోమ సోకుతుందని తగిన నివారణ చర్యలు పాటిస్తే సుడిదోమను నివారించవచ్చునని ఆమదాలవలస మండల వ్యవసాయాధికారి మెట్ట మోహనరావు పలు సూచనలు రైతులకు తెలియజేశారు.

వరిలో సుడిదోమ సోకే విధానం

వరిలో వస్తున్న సుడిదోమ శాస్త్రీయ నాయం నీల పర్వత ల్యూజెన్స్‌గా పిలుస్తారు. ప్రౌఢ దశలో రెక్కలు కలిగి ఉండవచ్చు, ఉండకపోవచ్చును. ఈ పురుగులు గోధుమ రంగులో ఉంటాయి. పిల్ల పురుగులు మొదట్లో తెలుపు రంగులో ఉండి క్రమేపి గోధుమ రంగులోకి మారుతాయి. పెద్ద పురుగులు, పిల్ల పురుగులు వరి దుబ్బులు మొదళ్లలో చేరి రసాన్ని పీలుస్తాయి. అందువలన మొక్కపై భాగానికి పోషక పదార్థాలు అందక ఆకులు పసుపు రంగులోకి మారిపోతాయి. వరి దుబ్బులు ఎండిపోతాయి. వరి దుబ్బులు సుడులు, సుడులుగా పొలంలో అక్కడక్కడ ఎండిపోతాయి. అందుచేత దీన్ని సుడిదోమ తెగులు అని కూడా అంటారు. దీనినే హావర్‌బర్న్ అని పిలుస్తారు. ఈ పురుగు మొదట్లో పొలంలో అక్కడికక్కడ ఆశించి ఒక వలయం ఆకారంలో పంటను నాశనం చేస్తాయి. తల్లి పురుగు తన జీవిత కాలంలో 300-400 గుడ్లను ఆకుల తొడిమలలో వరుసగా పెడుతుంది. గుడ్డు దశ 5 రోజుల్లో గుడ్లు పొదిగాక పిల్ల పురుగులు బయటకు వస్తాయి. పిల్ల పురుగులు 10 నుంచి 13 రోజుల్లో అభివృద్ధి చెంది రెక్కల పురుగులుగా మారతాయి. 25 సెంటీగ్రేడ్ నుంచి 30 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత ఉన్నప్పుడు ఈ దోమలు ఎక్కువగా వృద్ధి చెందుతాయి.

నివారణ చర్యలు

వరి పంటపొలాన్ని అడపాదడపా ఆరబెట్టాలి. ప్రతి 2 మీటర్లకు 20 సెంటీమీటర్ల కాలిబాటను వదలాలి. పిలక దశలో దుబ్బుకు పది దోమలు, ఈనె దశలో దుబ్బుకు 20 నుంచి 25 దోమలు ఉన్నప్పుడు సస్య రక్షణ చర్యలు చేపట్టాలి. దోమ సోకిన వరి పంటకు మోనోక్రోటోఫాస్ 2.2 మిల్లీ లీటర్లు లేదా ఇథోఫెన్‌ఫాస్ 1.2 మిల్లీ లీటర్లు లేదా బీపీఎమ్‌సీ 2 మిల్లీ లీటర్లు లేదా ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా ఇమిడాక్లోప్రిడ్+ఇథరెల్ 0.25 గ్రాములు లీటరు నీటికి పురుగు మందులను పిచికారీ చేయాలి. బూప్రోఫెజిన్ 1.6 మిల్లీ లీటర్లు లేదా ఇతోఫెన్ ప్రాక్స్ 2.0 మిల్లీ లీటర్లు, లేదా ఫైమెట్రోజైన్ 0.6 గ్రాములు లేదా డైనోటెప్యూరాన్ 20 ఎస్‌జీ 0.5 గ్రాములు ట్రిఫ్లుమిజోపైరిమ్ 0.48 మిల్లీ లీటర్లు లీటరు నీటికి పిచికారీ చేయాలి.

ఆదిత్యుని సన్నిధిలో భక్తజనం


సూర్యనమస్కార పూజలు చేయించుకుంటున్న భక్తులు


ఆదిత్యుని జ్ఞాపికను తిరుపతి మేయర్ శిరీషకు అందజేస్తున్న ఈఓ హరిసూర్యప్రకాష్

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి సన్నిధిలో ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేయించుకున్నారు. స్థానిక జిల్లాతో పాటు ఇతర జిల్లాల నుంచి కూడా ప్రముఖులు, భక్తులు కూడా తరలివచ్చి ఆదిత్యునికి మొక్కులు చెల్లించుకున్నారు. తలనీలాల మొక్కులను కొందరు చెల్లించుకోగా, మరికొందరు ఆరోగ్యం కోసం గోధుమలు, బెల్లం, పటిక తదితర వస్తు సామగ్రిని దానం ఇచ్చారు. స్థానికులకు విశిష్ట దర్శన క్యూలైన్ల నుంచి ఉచితంగా దర్శనాలకు పంపించడంతో స్థానికులంతా హర్షం వ్యక్తం చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు రాకుండా ఆలయ ఈఓ వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మల ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అలాగే జిల్లాకు చెందిన పలువురు అధికారులు ఆదిత్యుడిని దర్శించుకున్నారు. తిరుపతి నగర మేయర్ డాక్టర్ రాచ శిరీష యాదవ్ దంపతులు స్వామిని తొలిసారిగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ సంప్రదాయ స్వాగతం పలికి అంతరాలయ దర్శనం చేయించారు. ఆలయ అర్చకులు ఇప్పిలి షణ్ముఖ శర్మ ఆలయ విశిష్టతను వివరించారు. ఇక ఒక్కరోజులో వివిధ దర్శన టిక్కెట్ల విక్రయాల ద్వారా రూ.1,54,800, విరాళాల రూపంలో రూ.90,750, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.1.80 లక్షల వరకు ఆదాయం సమకూరినట్లుగా ఈఓ తెలిపారు.

మృతులకు సంతాపంగా కొవ్వొత్తుల ర్యాలీ


కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న పద్మప్రియ, జెడ్పీటీసీ అన్నపూర్ణ తదితరులు


ర్యాలీలో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: మేజరు పంచాయతీ నరసన్నపేటలో వారం రోజుల వ్యవధిలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు ఆత్మహత్య చేసుకోవడంతో వారికి సంతాప సూచకంగా మహిళలు పెద్ద ఎత్తున ఆదివారం సాయంత్రం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. కాలేజీ మైదానం నుంచి లక్ష్మీ టాకీస్ కూడలి, వైఎస్సార్ కూడలి, పాతబస్టాండ్ మీదుగా జోగిపేట వరకూ కొవ్వొత్తుల ర్యాలీ కొనసాగింది. వరకట్న వేధింపులకు వివాహిత నవ్య, ఆమె మృతిని తట్టుకోలేక తన తండ్రి గోవిందరావులు ఆత్మహత్య చేసుకున్నారు. వీరికి సంతాపంగా కళింగ కోమట్ల సంఘం పిలుపు మేరకు పట్టణానికి చెందిన వందల మంది మహిళలు ఇతరులు ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీఈసీ సభ్యురాలు ధర్మాన పద్మప్రియ, సుడా చైర్మన్ కోరాడ ఆశాలత జెడ్పీటీసీ చింతు అన్నపూర్ణలతో పాటు మాజీ సర్పంచ్ ఊణ్ణ రాజేశ్వరి, కళింగ కోమట్లు సంఘం మహిళా విభాగం ప్రతినిధి తంగుడు జ్వాల తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఫెన్సింగ్ ఎంపిక పోటీలు


ఫెన్సింగ్ ఎంపికలను ప్రారంభిస్తున్న బలభద్రుని సురేష్‌కుమార్, పక్కనే సంఘ ప్రతినిధులు, కోచ్‌లు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఫెన్సింగ్ ఎంపిక పోటీలు హోరాహోరీగా సాగాయి. జిల్లాకి చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి జిల్లాకు కీర్తిప్రతిష్టతలు తీసుకురావాలని ఫెన్సింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) పిలుపునిచ్చారు. శ్రీకాకుళం జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాకుళం నగరంలోని టౌన్‌హాల్‌లో జిల్లా అండర్-23, సీనియర్స్ విభాగాల్లో పురుషులు, మహిళలకి వేర్వేరుగా ఎంపికలను నిర్వహించారు. అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ఎంపికలను లాంఛనంగా ప్రారంభించిన రాజా మాట్లాడుతూ క్రీడాకారులకు అందిస్తున్న ఫెన్సింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అసోసియేషన్ పరంగా క్రీడాకారులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తామన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన వారు ఈనెల 14,15 తేదీల్లో కాకినాడలోని శుభం కాపు కల్యాణ మండపంలో జరగబోయే ఏపీ రాష్ట్రస్థాయి ఫెన్సింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో పాల్గొని సత్తాచాటాలని ఆయన పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అందిస్తున్న స్పోర్ట్స్ కోటాను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇప్పటికే కొంతమంది స్పోర్ట్స్ కోటా ద్వారా ఎంబీబీఎస్‌లో, ఏజీబీఎస్సీలలో సీట్లు సాధించారని గుర్తుచేశారు. సీఎం క్రీడలకు పెద్దపీట వేస్తున్నారని కొనియాడారు.

ఎంపికైన క్రీడాకారుల జాబితాను త్వరలో వెల్లడిస్తామని సంఘ బాధ్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తైక్వాండో అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి తైక్వాండో శ్రీను, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధులు కార్యదర్శి జోగిపాటి వంశీ, కోశాధికారి డి.భవానీ, రాహుల్, దిబ్బ దిలీప్ కుమార్, వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, సుధీర్ వర్మ, గురుగుబెల్లి ప్రసాద్, సంపతిరావు నాయుడు, జిలానీ, సహార కృష్ణ, భాస్కర్‌రావు, నెక్స్‌జెన్ రఘునాథ్‌రావు, అనిల్‌కుమార్, డీసీసీబీ బ్రాంచ్ మేనేజర్ దినమని, పెయ్యల చంటి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం తీర్మానం


సర్వ సభ్య సమావేశానికి హాజరైన ఉత్తరాంధ్ర జిల్లాల వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగ సంఘ ప్రతినిధులు

సాక్షి, విశాఖపట్నం : దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం రీజనల్ అధ్యక్షుడు శ్రీనివాసరాజు డిమాండ్ చేశారు. నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో వైఎస్సార్ విద్యుత్ ఉద్యోగుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఉద్యోగుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. తమ సమస్యలను ముఖ్య అతిథిగా హాజరైన డిస్కమ్ సెక్రటరీ పీకేవీఎం లక్ష్మీరావు దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆయన.. ఉద్యోగుల సమస్యలను డిస్కమ్‌ల దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం స్పోర్ట్స్ విభాగంలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యుత్ ఉద్యోగులు అన్సర్ అలీ, మాధవ్‌లను శ్రీనివాసరావు సత్కరించారు. ఈ సమావేశంలో విశాఖ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కె.హరిబాబు, ఎం శ్రీనివాసరావు, జోన్-2 బ్రాంచ్ అధ్యక్ష, కార్యదర్శులు జి.శ్రీనివాసరావు, పి.త్రిమూర్తులు, స్టేట్ కంపెనీ అసిస్టెంట్ సెక్రటరీ రాజబాబు, డిస్కమ్ ట్రెజరర్ బి.సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

'ఆప్షన్లు ఇచ్చిన కళాశాలలో సీట్లు రాలేదు'

ఎచ్చెర్ల క్యాంపస్: పీజీ సెట్-2023 ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయానికి మొదటి ప్రాధాన్యత ఇస్తే ఇతర వర్సిటీ, కళాశాలల్లో సీట్లు వచ్చాయని కొందరు విద్యార్థులు వర్సిటీ అధికారులకు తెలిపారు. ఈ మేరకు పీజీ సెట్ కన్వీనర్, ఆంధ్రావిశ్వవిద్యాలయం ఇంజినీరింగ్ కళాశాల ప్రొఫెసర్ సీహెచ్‌వీవీఎస్ భాస్కర్‌రెడ్డి దృష్టికి స్థానిక అధికారులు తీసుకు వెళ్లారు. రెండో కౌన్సెలింగ్‌లో విద్యార్థులు మళ్లీ ఆప్షన్లు ఇచ్చుకోవాలని కన్వీనర్ సూచించారు. సాంకేతిక లోపాలు ఉంటే సరిచేస్తామని అన్నారు.